

ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు.. అంటూ గొంతుపిక్కటిల్లేలా టిడిపి కూటమి నాయకులు మాట్లాడారు. అధికారంలోకి రాగానే ఆ మాటలను పక్కన బెట్టి సైలెంట్‌గా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును షురూ చేశారు. అనంతపురం నగరంతో పాటు పలు ప్రాంతాల్లో ఇప్పటికే వీటి ఏర్పాటు జోరుగా జరుగుతోంది. ప్రీపెయిడ్ పద్ధతుల్లో ఉండే ఈ స్మార్టుమీటర్ల ఏర్పాటు బాధ్యతలను ఆదానీ సంస్థ చేపడుతోంది. అనంతపురం జిల్లాలో ఈ ప్రక్రియ వేగంగా కొనసాగుతుండడం గమనార్హం.



కార్డుదారులకు ఈకేవైసీ బెంగ..!

డీలర్ : హలో... రేహనబేగమేనా మాట్లాడేది..


లబ్ధిదారురాలు : అవును.. మీరు ఎవరు.?

డీలర్ : మీఇంట్లో ఉండే వారందరూ ఆధార్‌కార్డులు తీసుకుని స్టోర్ దగ్గరకు వచ్చి ఈకేవైసీ వేయించుకోండి. లేదంటే మీకు బియ్యం కట్ అవుతాయి. అందరూ రావాలి.

లబ్ధిదారురాలు : సార్.. మాఆయన రోజు కూలి పనికి వెళ్లారు. ఒక రోజు కూలికి వెళ్లకపోతే మా ఇల్లు గడవదు. వెంటనే రావాలంటే ఎలా సార్.. పని లేని రోజున మేము వస్తాం.

డీలర్ : లేదు.. లేదు.. ఈనెల 28వతేదీ లోపు మీ కుటుంబ సభ్యులందరూ ఖచ్చితంగా ఆధార్‌కార్డు తీసుకుని వచ్చి ఈకేవైసీలో వేలిముద్రలు వేయాలి. లేకుంటే రేషన్‌కార్డు రద్దు అవుతుంది.

రేషన్‌కార్డు దారులకు ఈకేవైసీ పేరుతో వస్తున్న ఫోన్‌కాల్స్ ఇవి. గత కొన్ని రోజులుగా కార్డులో ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని, లేకుంటే కార్డు రద్దు అవుతుందంటూ ఫోన్‌కాల్స్ వస్తుండడంతో పేదలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.





పెనుకొండలో ఈకేవైసీ కోసం రేషన్ షాపు వద్ద గుమిగుడిన రేషన్‌కార్డుదారులు

- వేలిముద్రలు వేయకపోతే కార్డులో పేరు తొలగిస్తారని ప్రచారం
- కార్డులో ఉన్నవారందరూ వేలిముద్రలు వేయాల్సిందే
- ఈనెల 28వరకు గడువు
- పనులు వదిలిపెట్టి రేషన్‌షాపుల వద్ద పడిగాపులు

ప్రజాశక్తి-పెనుకొండ

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ డివిజన్‌లో 2,31,862 రేషన్ కార్డులున్నాయి. ఈ కార్డుల్లో దాదాపు 9.5లక్షల మంది ఉన్నట్లు అంచనా. ప్రతినెలా 2,320 క్వింటాళ్ల బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ కేటాయిస్తోంది. ఈ బియ్యాన్ని 502 రేషన్‌షాపుల ద్వారా కార్డులదారులందరికీ పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లక్షలాది మంది కార్డుదారులందరూ కేవలం వారం వ్యవధిలోనే ఈకేవైసీ చేయించుకోవాలంటూ ఫోన్లు వస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో ఇప్పటికే కార్డుదారులతో ఈకేవైసీ పూర్తి చేయించారు. అధికారుల అలసత్వం, డీలర్ల నిర్లక్ష్యం కారణంగా ఇంత వరకూ సత్యసాయి జిల్లాలో ఈ తంతు పూర్తి కాలేదు. జిల్లా అధికారుల హెచ్చరికలతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఆఘమేఘాల మీద ఈ కార్యక్రమం పూర్తి చేసేందుకు ఉపక్రమించారు. వారి నిర్లక్ష్యానికి పేదలను బలి చేస్తూ ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. అధికారుల ఆదేశాలతో డీలర్లు హడావుడిగా కార్డుదారులను భయపెట్టి ఈకేవైసీ చేయించే పనిలో నిమగ్నం అయ్యారు.

ఈనెల 28వరకు గడువు

రేషన్‌కార్డులో ఉన్న కుటుంబ సభ్యులందూ ఈనెల 28వ తేదీలోపు వేలిముద్రలు వేసి ఈకేవైసీ చేయించుకోవాలని డీలర్లు గడువు విధిం చారు. దీంతో రేషన్ కార్డు దారులు ఆఘ మేఘాలపై ఆధార్ కార్డులు తీసు కుని కుటుంబ లోని సభ్యులందరినీ రేషన్‌షాపుల వద్దకు పిలుస్తున్నారు. దీంతో రేషన్‌షాపుల వద్ద జనం పడిగాపులు కాస్తున్నారు. ఒక రేషన్ కార్డులో ఉన్న వారిందరితో వేలిముద్రలు తీసుకోవాలంటే కనీసం 10 నుంచి 15 నిమిషాల వ్యవధి పడుతోంది. సర్వర్ సమస్యలు తోడు కావడంతో ఉదయం నుంచి సాయంత్ర వరకూ 10 నుంచి 20 కుటుంబాలు మాత్రమే ఈకేవైసీ చేసే పరిస్థితి క్షేత్ర స్థాయిలో కన్పిస్తోంది.

పనులు వదిలిపెట్టి పడిగాపులు

రేషన్ కార్డులున్న కుటుంబాలు అత్యధికంగా రోజు కూలిపనులు చేసుకునే పేదలుంటారు. ఈకేవైసీ చేయించుకోడానికి కుటుంబం మొత్తం రేషన్ షాపుల వద్ద రోజంతా పడిగాపులు పడాల్సి వస్తోంది. ఉదయం వస్తే సాయంత్రం అయిన వేలిముద్రలు వేయలేని పరిస్థితులున్నాయి. నెట్‌వర్క్ సరిగా పనిచేయలేదని, వేలిముద్రలు పడడం లేదని ఇలా ఏదో ఒక సమస్యతో రోజంతా స్టోర్‌వద్దే ఉండిపోవాల్సి వస్తోంది.

కార్డులో పేరు తొలగిస్తారని ప్రచారం

కార్డులో ఉన్న కుటుంబసభ్యులందరూ వేలిముద్రలు వేస్తేనే బియ్యం వస్తాయని, లేకుంటే కార్డుల్లో పేర్లు తొలగిస్తారనే ప్రచారం సాగుతోంది. దీంతో రేషన్ కార్డు దారుల్లో భయం పట్టుకుంది. ప్రతినెల వచ్చే బియ్యం రాకపోతే కుటుంబ పోషణ భారం అవుతుందని పలువురు కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు.



వేలిముద్రలు వేస్తున్న మహిళ

విద్యార్థులకు ఇబ్బందులు

కార్డుల్లో ఉన్న వారందరూ ఈకేవైసీ చేయించుకోవాలనే నిబంధనతో ఇతర ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతుఆన్నరు. ఉన్నఫళంగా చెప్పడంతో వారంతా సెలవులు పెట్టి సొంత ఊరికి వచ్చి ఈకేవైసీ చేయించేందుకు ఇబ్బందిపడుతున్నారు. పరీక్షల సమయం కావడంతో వారిని పంపడానికి పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఒప్పుకోవడం లేదు.

ఈకేవైసీ గడువు పొడిగించాలి



రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులందరూ వేలిముద్రలు వేసి ఈకేవైసీ చేయించుకోడానికి గడువు పొడిగించాలి. వారం రోజులు గడువు పెట్టి పేదలను భయంపెట్టడం సరికాదు. ఇతర ప్రాంతాల్లో చదువుకుంటున్న వారు చాలా మంది ఉన్నారు. వారంతా ఉన్నఫళంగా రావాలంటే ఇబ్బందులున్నాయి. అధికారులు స్పందించి ఈకేవైసీ గడువును పొడిగించాలి.

హరి, సిపిఎం నాయకులు

'స్మార్ట్' షురూ..!

- అనంతలో 22,447 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు
- ఎన్నికల ముందు వ్యతిరేకించిన కూటమి
- అధికారంలోకి రాగానే సైలెంట్‌గా స్మార్టు మీటర్ల ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



అనంతపురం జిల్లా పరిధిలో అన్ని రకాలు కలిపి మొత్తం 8,90,534 మీటర్లు ఉన్నాయి. ఇందులో 200 యూనిట్లకంటే ఎక్కువ బిల్లులు వచ్చే అన్ని మీటర్లను స్మార్టు మీటర్లుగా మార్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి నిర్ణయించాయి. ఇప్పుడు జరుగుతన్న విద్యుత్ పంపిణీలో నష్టాలను అంచనా వేయడంతోపాటు, నివారణకు చర్యలు తీసుకునే పేరుతో దీన్ని చేపట్టారు. రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సర్వీస్ సెక్టార్ (ఆర్‌డిఎస్ఎస్) పేరుతో దీన్ని చేపడుతున్నారు. అనంతపురం జిల్లాలో ఇప్పుడున్న విద్యుత్ మీటర్ల స్థానంలో ప్రీపెయిడ్ మీటర్లను అమర్చాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇప్పుడు విద్యుత్ బిల్లులు 200 యూనిట్లకంటే అధికంగా వచ్చేవాటిని మార్చాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాలో 5,52,534 మీటర్లను స్మార్టు మీటర్లుగా మార్చాలని నిర్ణయించారు. ఇది అమర్చడం పది సంవత్సరాల పాటు నిర్వహణ బాధ్యతలను గత ప్రభుత్వ హయాంలోనే ఆదానీ సంస్థకు అప్పగించారు. ఇందుకోసం రూ.357 కోట్ల నిధులను కేటాయించారు. ఈ సంస్థ ఇప్పటికే ఈ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించింది. నేరుగా ప్రజలకు సంబంధించిన మీటర్లు మారిస్తే వ్యతిరేకత వస్తుందని భావించి ముందుగా నగర పాలక సంస్థ, ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు వీటిని అమరుస్తున్నారు. అదే క్రమంలో వాణిజ్యపరమైన వాటికి కూడా ఈ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. అనంతపురం జిల్లాలో ఈ మీటర్ల ఏర్పాటు గతనెలాఖరు వరకు చూస్తే 22,447 అమర్చారు. రాబోయే రోజుల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను వేరు చేయడం వంటివి కూడా చేయనున్నారు.

వ్యతిరేకత వ్యక్తమవుతున్నా ముందుకే...

స్మార్ట్ మీటర్ల వద్దంటూ ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం నాయకులు పెద్ద ఎత్తునే డిమాండ్ చేశారు. యువగళం వేదికగా ప్రస్తుత రాష్ట్ర మంత్రి నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించడంతో పాటు వాటిని ఏర్పాటు చేస్తే పగలగొట్టండి అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వాటిని మరచి మరింత వేగవంతంగా స్మార్ట్ మీటర్లను ఆ ప్రభుత్వం జిల్లాలో ఏర్పాటు చేస్తూ పోతోంది. కొత్తగా ఏర్పాటు చేయబోయే మీటర్లు ప్రీపెయిడ్‌గా ఉంటాయి. ఇందులో బ్యాలెన్సు అయిపోతూనే విద్యుత్ సరఫరా అగిపోయే అవకాశముంది. ప్రస్తుతానికి ఇంకా పాత పద్ధతిలోనే బిల్లులు తీసుకున్నా, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పూర్తయిన వెంటనే ప్రీపెయిడ్ చెల్లింపులు ప్రారంభం కానున్నాయి.

చిల్లావారిపల్లిలో ఘర్షణ

రెండు గ్రామాల మధ్య కొనసాగిన ఆధిపత్య పోరు

చిల్లావారిపల్లికి చెందిన యువకుడు ఆత్మహత్యాయత్నం



ఘటనాస్థలం వద్ద నెలకొన్న ఉద్రిక్త పరిస్థితి

ప్రజాశక్తి - తాడిమర్రి

శివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని చిల్లావారిపల్లి గ్రామ సమీపాన ఉన్న శ్రీ కాటి కోటేశ్వర స్వామి ఆలయ పూజల విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. పూజల విషయంలో రెండు వర్గాల మధ్య గతంలో జరిగిన ఘర్షణలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఎంతటి బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను చేసిన తిరిగి బుధవారం ఘర్షణ చోటు చేసుకుంది. తమ గ్రామానికి పూజ చేసే అవకాశం దక్కలేదని చిల్లరవారిపల్లికి చెందిన యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘర్షణకు సంబందించి గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఆలయ నూతన అర్చకుడి నియామకం ఎండోమెంట్ వారి ఆధ్వర్యంలో జరిగిందిజ నూతన అర్చకుడిగా చిల్లకొండయ్య పల్లి గ్రామానికి చెందిన చిల్లా నాగేశ్వరయ్యను ఎండోమెంట్ డిఇఒ నరసింహ రాజు, వివో బిఆర్ వెంకటేష్ ఇన్స్పెక్టర్ వన్నూరు స్వామి ఆధ్వర్యంలో చిల్ల కొండయ్య పల్లి మాజీ ఎంపీపీ కొడిదేల రాజశేఖర్, మాజీ కన్వీనర్ కొడివేల సాయి సమక్షంలో నియమించారు. ఈ నేపథ్యంలో స్వామివారికి సంబంధించిన వెండి ఆభరణాలు, నాగఫణిగలను మునుపు పని చేస్తున్నటువంటి బ్రాహ్మణ అర్చకుడైన అశోక్ శాస్త్రి అందరి సమక్షంలో పొందుపరిచారు. అదే తరుణంలో చిల్లవారిపల్లి గ్రామంలో ఉన్నటువంటి చిల్లా అంకె నల్లపు గంగిరెడ్డి జానగాని ఉరుముల దాసగానిపల్లి ఏడు కాపుల వారికి సంబంధించిన ఉత్సవ గుర్రాల ప్రతిమలను ఊరేగింపు కోసం అందరి అంగీకారంతో పోలీసు వారి సమక్షంలో రెవెన్యూ ఎండోమెంట్ వారి ఆధ్వర్యంలో బొలెరో వాహనంపై మూడు గుర్రాలను తీసుకువెళ్లడానికి సిద్ధమయ్యారు. అయితే చిల్లవారి పల్లి గ్రామస్తులు వాహనాన్ని అడ్డుకున్నారు. గుర్రాల ప్రతిమలను తీసుకుపోతే పెట్రోల్ పోసుకుని తగలబెట్టుకుంటామని కొందరు మహిళలు హెచ్చరించారు. ఈసందర్భంగా మహిళలు పెట్రోల్ ఒంటిపై పోసుకొనడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు కొద్దిమంది ప్రజలు బొలెరో వాహనాన్ని అడ్డుకొని రాళ్లతో కట్టెలతో దాడి చేసి బొలెరో వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘర్షణలో వాహన డ్రైవర్‌కు, అందులో ఉన్న వారికి గాయాలు అయ్యాయి. దీంతో పోలీసులు స్పందించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గుర్రాల ప్రతిమను వెనక్కి తీసుకువెళ్లి యదావిధిగా ఉన్న స్థానంలో ఉంచారు. తర్వాత ఎలాంటి ఘర్షణలు జరుగకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు.



పగిలిపోయిన బొలెరో వాహనం అద్దాలు

యువకుడు ఆత్మహత్యాయత్నం : మహాశివరాత్రి పర్వదినాన శ్రీ కాటి కోటేశ్వర స్వామి పూజ సేవా కార్యక్రమం నిర్వహించడానికి చిల్ల కొండయ్య పల్లి గ్రామానికి చెందిన చిల్లా నాగేశ్వరయ్యను నియమించారు. ఈ నేపథ్యంలో తమ ఊరికి ఈ అవకాశం దక్కలేదన్న కారణంతో చిల్లరవారిపల్లికి చెందిన గంగిరెడ్డి ఓపిరెడ్డి కుమారుడు గంగిరెడ్డి మంజునాథ్ రెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తోటకు పిచికారి చేసే మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు స్పందించి మంజునాథరెడ్డిని అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు,

రుణం మంజూరు చేయాలంటే.. కార్డు తీసుకోవాల్సిందే

పేదలపై పరిశీలన సిబ్బంది జులుం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో ఉన్న ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ సంస్థ గృహ రుణాల పేరుతో మోసం చేయడమే కాకుండా అందులో పనిచేసే సిబ్బంది రుణ మంజూరు కోసం పరిశీలనకు వెళ్లిన సమయంలో రుణాలు మంజూరు చేయాలంటే ట్రైడ్ రూపే కార్డులను కొనాల్సిందే అంటూ పేదలపై జులుం చెలాయిస్తున్నారు. సోమందేపల్లికి చెందిన మాబు సాబ్ తన కుమార్తె వివాహం కోసం డబ్బులు తక్కువ పడడంతో తన స్వాధీనంలో ఉన్న ఇంటిని పట్టణంలో ఐఐఎఫ్ఎల్ గృహ ఫైనాన్స్ లో తాకట్టుపెట్టి రుణం తీసుకోవడానికి అక్కడ పనిచేసే సిబ్బందిని కలిశాడు. సిబ్బంది ఇతని ఇంటికి సంబంధించిన పత్రాలను పరిశీలన చేసి రుణం మంజూరు చేస్తామని, దానికి సంబంధించి రూ. 3వేలు చెల్లించడంతో పాటు తన ఇంటిని ఫైనాన్స్ సంస్థ పేరిట మార్టిగేజ్ చేసి ఇవ్వాలని తెలిపారు. రూ 15 వేల వరకు ఖర్చు చేసి వారు చెప్పిన విధంగా అన్ని నిబంధనలను మాబుసాబ్ పూర్తి చేశారు. ఫైనాన్స్ సంస్థ మార్టిగేజ్ చేసి ఇచ్చిన ఇల్లు అతనిదేనా అని ఫైనాన్స్ సంస్థ పరోక్ష సిబ్బందితో పరిశీలన చేయించారు. పరిశీలనకు వచ్చిన సిబ్బందికి ఎటువంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే పరిశీలనకు వచ్చిన సిబ్బంది తమ వద్ద ఉన్న ట్రైడ్ రూపే కార్డు కొంటేనే రుణం మంజూరు అవుతుందని ఒత్తిడి చేస్తూ, అవసరం లేకున్నప్పటికీ రూ. 2,500 తీసుకొని ఆ కార్డులను పేదలకు అంట గడుతున్నారు. నిజంగా ఆ కార్డు నుంచి ఎటువంటి ఉపయోగం లేదు. ఎక్కడ రుణాలు మంజూరు కాదో అన్న భయంతో వేలాది రూపాయలు వెచ్చించి కార్డులను పేదలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ఫైనాన్స్ సంస్థ ప్రాసెసింగ్ ఫీజు, మార్టిగేజ్, ఇతర ఫీజుల రూపంలో రూ. 3 లక్షలకు దాదాపు రూ. 28 వేల వరకు వసూలు చేస్తోంది. ఇది చాలదన్నట్లు తీసుకున్న రుణానికి వడ్డీలపై వడ్డీ వేస్తూ పేదల నడ్డి విరుస్తున్నారు. ఫైనాన్స్ సంస్థ మంజూరు చేసిన రుణానికి, ఖాతాల్లో జమ చేసే రుణానికి పోలిక ఉండదని, సిబ్బంది సూచించిన నెలవారీకంతులు తప్పనిసరిగా చెల్లిస్తున్నప్పటికీ సంవత్సరాలు గడిచిన అసలు మొత్తం తగ్గడం లేదనిఫైనాన్స్ లో తీసుకున్న రుణాగ్రస్తులు వాపోతున్నారు. ఫైనాన్స్ సంస్థపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని ఫైనాన్స్‌లో రుణాలు తీసుకున్న బాధితులు కోరుతున్నారు.



పరిశీలనకు వచ్చిన సిబ్బంది పేదలకు ఇస్తున్న రూపే కార్డు



పోలీసులకు సీసీ కెమెరాలు అందజేస్తున్న దృశ్యం

సీసీ కెమెరాలు పంపిణీ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గంలో శాంతిభద్రత పరిరక్షణ, ప్రజా ప్రయోజనాలే ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ప్రధాన ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ డిఇ రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే చొరవతో రూ.25 లక్షల విలువ చేసే సీసీ కెమెరాలను బుధవారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎస్పీ వీకే మహేష్ కు గ్రీన్ కో కంపెనీ ప్రతినిధి అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని స్థానిక ప్రజల శాంతి భద్రతలు, ప్రజా ప్రయోజనం దృష్ట్యా హైదరాబాదుకు చెందిన గ్రీన్ కో కంపెనీ ఆధ్వర్యంలో హిందూపురం పట్టణానికి రూ.25 లక్షల విలువగల 150 వైర్ లెస్ కెమెరాలను మంజూరు చేయించారన్నారు. వీటిని హిందూపురం పోలీస్ సబ్ డివిజన్ అధికారులకు అందచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు, టూ టౌన్ సిఐ అబ్దుల్ కరీం, రూరల్ సిఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న కర్నాటక పోలీసులు

తమ సరిహద్దు ప్రాంతమని వాదించిన స్థానికులు

ముడుపుల కోసమేనన్న ఆరోపణ

ప్రజాశక్తి - రొద్దం

కర్నాటక సరిహద్దులో ఉన్న ఆంధ్ర పెన్నానది నుంచి గృహ నిర్మాణ అవసరాల కోసం ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను కర్నాటక పోలీసులు అడ్డుకున్నారు. ఈ విషయంపై గ్రామస్తులకు, పోలీసులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈఘటనకు సంబందించిన వివరాలు... మండలంలోని నారనాగేపల్లి సమీపంలో పెన్నానదిలో మంగళవారం రాత్రి సమయం లో నారనాగేపల్లి గ్రామానికి చెందిన వారు ఇసుకను ట్రాక్టర్‌లో నింపుతుండగా కర్నాటక పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. ఇది కర్నాటక ప్రాంతమని ఇసుకను తరలించడానికి వీలులేదని ట్రాక్టర్లకు స్టేషన్‌కు తీసుకురావాలని తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీసులు హెచ్చరించారు. అయితే ట్రాక్టర్ వారికి గ్రామస్తులు మద్దతు పలికారు. ఇది ఆంధ్రప్రాంతమని అడ్డుకోవటానికి వీలులేదని సమాధానమిచ్చారు. అయినా కర్నాటక పోలీసులు ట్రాక్టర్ యజమానులను బెదిరించారు. ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. దీంతో గ్రామస్తులు స్థానిక విలేకరులకు సమాచారమివ్వగా వారు అక్కడికి వెళ్లారు. ఇసుకను తరలిస్తున్న ప్రాంతం ఆంధ్రకు చెందినదని గూగుల్ మ్యాప్‌ద్వారా చూపించారు. అయినా వినలేదు. దీంతో చివరకు ఇక్కడి విషయాన్ని తిరుమణి పోలీసుస్టేషన్‌కు పోలీసులకు సమాచారమిచ్చారు. ఇసుకను తవ్వుతున్న ప్రాంతం ఆంధ్రకు చెందినదని నిర్ధారించుకుని ఘటనాస్థలంలో ఉన్న పోలీసులకు వెనక్కు పిలిపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కర్నాటక పోలీసులు వచ్చి ట్రాక్టర్ యజమానులను బెదిరించి రూ. 15వేలు వసూలు చేసుకుని వెళ్లారని ఈ విషయం తెలిసిన మరో బ్యాచ్ పోలీసులు డబ్బుల వసూలుకు వచ్చి ఉంటారని ఆరోపించారు.



ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్న కర్నాటక పోలీసులు

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - మడకశిర

అర్హులైన ఏడుగురికి మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బుధవారం పంపిణీ చేశారు. పట్టణంలోని రోడ్లు, రహదారుల విశ్రాంతి భవనంలో ఏడుగురికి 5,20,761 రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, జడ్పిటిసి సభ్యులు, మండల కన్వీనర్లు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



వివరాలు వెల్లడిస్తున్న అధికారి

ప్రజాశక్తి - కొత్తచెరువు

మార్చి 1వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలను జిల్లా వ్యాప్తంగా అన్ని ఏర్పాట్లను చేసినట్లు డివైఇఒ రఘునాథరెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా 42 పరీక్ష కేంద్రాల్లో 23, 942 విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఇందులో విద్యార్థినిలు 12,438 మంది, విద్యార్థులు 11,504 మంది ఉన్నారని చెప్పారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. అర్ధగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలన్నారు. ఆలస్యమైతే పరీక్ష సెంటర్లకు అనుమతించ బడదని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో 144 సెక్షన్ విధించడం జరిగిందన్నారు. తాగునీటి సౌకర్యం, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు.

వెలుగులోకి 'పురం' వాణిజ్య శాఖ అవినీతి మరకలు



పట్టణంలో ఉన్న వాణిజ్య శాఖ కార్యాలయం

ప్రజాశక్తిలో కథనాలు
ఇప్పటికే నలుగురు అధికారులపై వేటు
మిగిలిన వారిలో మొదలైన గుబులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ఉన్న వాణిజ్య శాఖ కార్యాలయంలో చోటు చేసుకున్న అవినీతిపై అధికారులు స్పందించారు. సమగ్ర విచారణ అనంతరం నలుగురు అధికారులపై వేటు వేశారు. దీంతో మిగిలిన అధికారుల్లో గుబులు మొదలైంది. కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై 'పైసా వసూల్' అన్న శీర్షికన ప్రజాశక్తి ఇటీవల ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై వాణిజ్య శాఖ కమిషనర్ బాబు స్పందించారు. వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ శేషాద్రి సూచనల మేరకు డిప్యూటీ కమిషనర్ మురళి మనోహర్‌ను విచారణ అధికారిగా నియమించారు. విచారణ అధికారిగా నియమించిన డిప్యూటీ కమిషనర్ మురళి మనోహర్ ఈనెల 12వ తేదీన హిందూపురం వాణిజ్య పనుల శాఖ కార్యాలయానికి విచారణ కోసం వచ్చారు. ఈ విషయాన్ని స్థానిక అధికారులతో పాటు విచారణ అధికారి సైతం అత్యంత గోప్యంగా ఉంచారు. విషయం తెలిసిన వెంటనే మీడియా ప్రతినిధులు కార్యాలయానికి వెళ్లారు. కార్యాలయంలోకి మీడియా ప్రతినిధులను అనుమతించకుండా దాదాపు రెండు గంటలసేపు అత్యంత రహస్యంగా స్థానిక అధికారులతో విచారణ అధికారి విచారణ చేశారు. ఈ విచారణలో అనుమానాలు వ్యక్తం కావడంతో 'అవినీతి ఆరోపణలపై గుట్టుగా విచారణ' అనే శీర్షికతో ప్రజాశక్తి మరో కథనాన్ని ప్రచురించింది. ఈ కథనాలపై స్పందించిన వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ సమగ్ర విచారణ కోసం రీజనల్ ఆడిట్ ఎన్‌ఫోర్స్ మెంట్ కమిషనర్ నాగేంద్ర ను విచారణకు ఆదేశించారు. ఆయన ఈనెల 17వ తేదీన పట్టణంలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో సమగ్ర విచారణ చేపట్టారు. అదే విధంగా పలువురు డీలర్లను విచారించారు. ఆ సమయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సమగ్ర విచారణ చేసిన అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తానని వివరించారు. అయితే అవినీతికి పాల్పడిన అధికారులు విచారణ కోసం వచ్చిన అధికారి నాగేంద్రను ప్రలోబపెట్టడానికి ప్రయత్నించారన్న ఆరోపణలు అప్పట్లో వెలువడ్డాయి. అయితే ఆయన ఎక్కడా రాజీ పడకుండా తన విచారణ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. దీనిపై స్పందించిన వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ బాబు హిందూపురం సర్కిల్ లో పనిచేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ కృష్ణవేణితో పాటు ఇదే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లు రాజశేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఇంతియాజ్‌బాషాను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నలుగురితో పాటు ఇదే కార్యాలయంలో పనిచేస్తున్న మరి కొంతమంది అవినీతి అధికారులతో పాటు సిబ్బందిపై వేటుపడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. హిందూపురం వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో అవినీతికి పాల్పడిన అధికారులను సస్పెండ్ చేయడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ శాఖలో కలకలం రేగింది.


బిల్లులు లేకుండా బెంగళూరు నుంచి సరుకులు తీసుకువచ్చి దించుతున్న రాందేవ్ ట్రేడర్స్ నిర్వాహకులు (ఫైల్ ఫొటో)


పారిశ్రామిక వాడలో బిల్లులు లేకుండా స్టీల్ పరిశ్రమలకు లారీలు, టెంపోల్లో తీసుకువచ్చిన ముడి సరుకు (ఫైల్ ఫొటో)

విద్యార్థుల జీవితాలతో చెలగాటం తగదు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని ప్రగతిశీల విద్యార్థి సంఘం నాయకులు విమర్శించారు. పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో బుధవారం జరిగిన రెండవ రోజు రాష్ట్ర మహాసభల ముగింపు సమావేశంలో నాయకులు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై తొమ్మిదినెలలు గడచినా తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదని అన్నారు. దీంతో పలు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించనిదే పరీక్షలు రాయించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం నాయకులు పాల్గొన్నారు.

28న కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ఈనెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు అత్యవసర కౌన్సిల్ సమావేశాన్నినిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో పట్టణంలోని పలు సమస్యలను, అజెండాలోని పలు అంశాలపై చర్చించి కౌన్సిలర్ల ఆమోదం పొందడం జరుగుతుందని తెలిపారు.

1న వాహనాల వేలం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

వివిధ మద్యం కేసులలో పట్టుబడిన వాహనాలను మార్చి నెల ఒకటో తేదీన స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ధర్మవరం ప్రోహిబిషన్ ఎక్సైజ్ సిఐ చంద్రామణి తెలిపారు. ఆసక్తి గల వారు ఈ బహిరంగ వేలంలో పాల్గొన వచ్చునని అన్నారు. వేలం ముగిసిన అనంతరం ఎక్కువ ధరకు పాట దారులకి వాహనాలు ఇవ్వడంతో పాటు నిబంధనల మేరకు తదితర వాహనాలకు నూతన రికార్డులను ఇస్తామని తెలిపారు.

విద్యుత్ లైట్ల ఏర్పాటు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం శివానగర్ లో ఉన్న శివాలయం తేరు శివరాత్రికి వైభవంగా జరుగుతుంది. అయితే శివాలయం కి వెళ్లే దారిలో విద్యుత్ లైట్ల సమస్య ఉండటం తో సమస్యను మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ బాబు దృష్టికి ఆలయ కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. దీంతో దాతలు బండారు నాగరాజు, పట్టణ అధ్యక్షులు జింకా చంద్రశేఖర్ స్పందించి విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయించారు.

కిక్కిరిసిన శివాలయాలు



పరిగి , లేపాక్షిలోని ఆలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - పరిగి

శివరాత్రిని పురస్కరించుకొని అన్ని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని బీర లింగేశ్వర స్వామి ఆలయంలో ఎంపీ పార్థసారథి తో పాటు మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలతో పాటు జ్యోతి ఊరేగింపులో పాల్గొన్నారు. కొడిగెనహళ్లి శివాలయంలో నిర్వహించిన కళ్యాణోత్సవంలో కేటీ శ్రీధర్ దంపతులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తచెరువులోని సంగమేశ్వర ఆలయం, పెద్దమ్మ స్వామి ఆలయం, నాగుల కణం దగ్గర ఉన్న శివాలయం , ఇల్లేంగటాంపల్లి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ధర్మవరం రూరల్: మహా శివరాత్రి పర్వదినము సందర్భంగా బుధవారం శివానగర్ లో గల శ్రీ బచ్చు నాగంపల్లి కాశీ విశ్వనాథ స్వామి రథోత్సవం సందర్భంగా విఎస్‌వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెయ్యిమందికి అన్నదానం చేశారు. ఎస్ఐ కేతన్న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, బుడగ వెంకటనారాయణ, వేణుగోపాల్, పాలగిరి శ్రీధర్, పూలశెట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మహా శివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని తిమ్మమ్మ మర్రిమాను వద్ద జరిగిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు కనీస సౌకర్యాలు తాగునీరు, వైద్యం భోజనాలు తదితర సౌకర్యాలు కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వలి బాషా ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

లేపాక్షి : మహాశివరాత్రి సందర్భంగా మండల కేంద్రం లోని దుర్గా వీరభద్ర పాపానసేశ్వర ఆలయంలో శివపార్వతుల కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా రాత్రికి జాగరణ సందర్భంగా సినీ ప్రముఖులతో సంగీత విభావరి, జబర్దస్త్ టీమ్ సభ్యులతో నాటికలను, లేపాక్షి కి చెందిన ఆశ్రయ ట్రస్ట్ తరుపున చిన్నారుల నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ జనార్దన్, ఎస్ ఐ నరేంద్ర ఆలయ చైర్మన్ రమనంద, అర్చకులు శీనస్వామి సింహ శర్మ సునీల్ శర్మ భక్తులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని సంకేపల్లి గ్రామ సమీపాన వీరనారాయణ స్వామి జాతర సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారని ఈ సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని సిఐ శివరాముడు తెలిపారు.

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని హేమావతి ఎంజేరు సిద్దేశ్వర స్వామి ఉత్సవాలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల టిడిపి మండల కన్వీనర్లు గణేష్, మదనగుంటప్ప, లక్ష్మీనారాయణ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : మహాశివరాత్రి వేడుకల సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుండి శివాలయాలు శివనామస్మరణతో మారుమోగిపోయాయి. పట్టణంలోని ఐదు లాంతర్ల సర్కిల్ లో ఉన్న చంద్రమౌళేశ్వరాలయం, కోటలో వెలసిన దక్షిణామూర్తి దేవాలయం, ప్రధాన రహదారిలో ఉన్న శివాలయం, శ్రీకంఠాపురం శివాలయం, ఆర్టీసీ కాలనీలోనిఉమ నర్మదేశ్వరాలయం, మోడల్ కాలనీ జలకంఠేశ్వరాలయం, పట్టణ సమీపంలోని బసవనపల్లి వద్ద ఉన్న భారీ శివుడి విగ్రహం వద్ద శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను టిడిపి నాయకులు బుధవారం పరిశీలించారు. మండలంలో అభివృద్ధి పనుల కోసం మంత్రి సవిత రూ.2,14 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో మండలంలో ఈ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి ఈ సందర్భంగా మంత్రి ఆదేశాల మేరకు టిడిపి మండల నాయకులు పట్టణంలో మూడు హాస్టల్లో మౌలిక వసతులు కోసం జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరుగుతోందన్నారు. మండలంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగానే స్పందించిన ఆమె నిధుల మంజూరుకు కృషిచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలకృష్ణ చౌదరి, మాజీ సర్పంచి నరేష్, నిమ్మల శ్రీధర్, వెంకటరెడ్డి, వేణు రాయల్, హజ్మతుల్లా, జయరాం, గిరిధర్ గౌడ్, నిడిమామిడిప్ప తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని వద్దిరెడ్డిపల్లి గ్రామ చివరిలో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించిన 9 మందిని అరెస్టు చేసి 72వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ద్విచక్రవాహనం దగ్ధం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని సుందరయ్యనగర్ లో బుధవారం తెల్లవారు జామున తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన స్కూటీని గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధం అయిందని వాహన యజమాని సంజీవరెడ్డి తెలిపారు. ఆ సమయంలో ఇంటి ముందు పెద్ద ఎత్తున మంటలు రావడంతో ఇరుగు పొరుగు వారి సాయంతో మంటలను ఆర్పివేశామన్నారు. అయితే అప్పటికే వాహనం దగ్ధమైందన్నారు. ప్రమాద ఘటనపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

నార్పలలో చోరీ

ప్రజాశక్తి-నార్పల

స్థానిక దుగుమర్రి రోడ్డులో ఉన్న చర్చి వెనుక నివాసం ఉంటున్న చర్చి పాస్టర్ డేవిడ్ ఇంట్లో బుధవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. దొంగలు ఇంట్లోకి చొరబడి రూ. 4 లక్షల నగదు, 10 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాగర్, పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సోలార్ ప్యానళ్లు, మోటార్లు అపహరణ

గుత్తి : మండలంలోని ఎంగిలిబండ గ్రామ సమీపంలో ఉన్న ఓ తోటలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. రైతు శశి కుమార్‌కి చెందిన తోటలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానళ్లు, స్టార్టర్ మోటార్లు, కేబుల్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం తోటకు వెళ్లిన రైతు చోరీ జరిగిన విషయాన్ని గ్రహించాడు. దాదాపు రూ. 2 లక్షలు విలువచేసే వస్తువులను దుండగులు దోచుకెళ్లినట్లు బాధితుడు వాపోయాడు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. పలువురికి గాయాలు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. నంద్యాల-తాడిపత్రి ప్రధాన రహదారిపై ముందు వైపు బండల లోడుతో వెళ్తున్న ఓ ట్రాక్టర్‌ను బనగానపల్లి నుంచి వస్తున్న బనగానపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం ధ్వంసం కాగా డ్రైవర్ కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న ఆరుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 ద్వారా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఆలయాల వద్ద ప్రత్యేక భద్రత

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మహాశివరాత్రి వేడుకల సందర్భంగా శైవ క్షేత్రాల వద్ద గట్టి భద్రత ఏర్పాట్లు నిర్వహించినట్లు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. ఆలయ పరిసర ప్రాంతాలలో నిఘా కోసం డ్రోన్లు మరియు సోలార్ సిసి కెమెరాలను వినియోగిస్తున్నామని చెప్పారు. ఆలయాల్లో, క్యూ లైన్ల వద్ద, పార్కింగ్ ప్రదేశాల వద్ద , ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం లేకుండా తెల్లవారుజాము నుంచే తగు జాగ్రత్తలు చేపట్టామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని , భక్తుల పట్ల గౌరవంగా మసులుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

నాటుసారా జోలికెళ్లొద్దు

ప్రజాశక్తి-గుత్తి

గ్రామాల్లో ప్రజలు నాటుసారా జోలికి వెళ్లరాదని ఎక్సైజ్ సిఐ ఇ.మోహన్‌రెడ్డి సూచిం చారు. నాటుసారా తాగితే అనారోగ్యా నికి గురవు తారని తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలం లోని ఈశ్వరపల్లి, జక్కలచెరువు, టి.కొత్తపల్లి గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు నాటుసారా తాగితే కలిగే దుష్పరిణామా లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్సైజ్ సిఐ మాట్లాడుతూ నాటుసారా తయారుచేసినా, విక్రయిం చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా నాటుసారా తయారు చేస్తున్నట్లు, విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జి.గోపాల్, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీరామ్మా, వెంకటరమణ, కానిస్టేబుల్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో టిడిపి కార్యకర్త మృతి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని గుండిగానిపల్లి గ్రామా నికి చెందిన టిడిపి కార్యకర్త రాజన్న(50) పాము కాటుకు గురై మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. రాజన్న బిటిపి ఆయకట్టు కింద వరి పంట సాగు చేశాడు. పంటకు నీరందించేందుకు మంగళ వారం సాయంత్రం తోటకు వెళ్లాడు. పంటకు నీరు పెడుతుండగా విషపురుగు కాటు వేయడంతో స్పృహ తప్పిపడిపోయాడు. గమనించిన చుట్టుపక్కల పొలాల రైతులు అతడిని కళ్యాణదుర్గం ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గుండుగానిపల్లి టిడిపి నాయకులు రాజన్న మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరా మర్శించారు. పార్టీ తరపున సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. అదే గ్రామానికి చెందిన గిడ్డనీలప్పగారి రామచంద్ర రూ. 5వేలు అందజేశారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర తెలుగు రైతు కార్య దర్శి కురుగౌడ, నాగిరెడ్డి, చంద్రన్న, డీలర్ కేశవర్ధన్ గౌడ్, ఐటిడిపి నాయకులు బజ్జన్నగౌడ, భీమరెడ్డి, తిప్పేస్వామి, రామాంజనేయులు, రవీంద్ర, రామంజి, వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్ 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు, గురుసదన్ ఆశ్రమంలో విద్యార్థులకు అన్నదానం చేశారు. ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్. ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులు క్రాంతికిరణ్, మాధురి దంపతుల కుమార్తె శర్వాణి పుట్టినరోజు సందర్భంగా పేదలు, విద్యార్థులు మొత్తం 150 మందిక అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సుబ్రహ్మణ్యం, ఓబుళపతి, కిష్టప్ప, రవికుమార్, లక్ష్మీ నారాయణ, మణిదీప్, తదితరులు పాల్గొన్నారు.

'జెకె దివ్యశ్రీ' మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నగరంలోని ఆదిమూర్తినగర్‌లో బుధ వారం 'జెకె దివ్యశ్రీ' మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రముఖ వైద్యులు డాక్టర్ రామ్మోహన్ సతీమణి ఉమామహేశ్వరి పున్ణప్రారంభించారు. సుదీర్ఘకాలం గా దివ్యశ్రీ హాస్పిటల్‌గా ఖ్యాతి గడించిన దివ్యశ్రీ ఆసుపత్రి ఇక నుంచి డాక్టర్ జాషువా కాలేబ్, డాక్టర్ కృష్ణ విపి ఆధ్వర్యంలో అత్యాధునిక వైద్య సౌకర్యాల తో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతో మల్టీ స్పెషా లిటీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తుంది. డాక్టర్ జాషువా కాలేబ్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా ప్రజలకు జెకె దివ్యశ్రీ మల్టీ స్పెషాలిటీ హాస్పి టల్ ద్వారా న్యూరో గ్యాస్ట్రో ఎంట్రాలజీలో మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ప్రముఖ సీనియర్ వైద్యు లు డాక్టర్ రామ్మోహన్ పర్యవేక్షణలో న్యూరో, గ్యాస్ట్రో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. నిరంతరం నిష్ణాతులైన వైద్యులు, సిబ్బంది పర్య వేక్షణలో జెకె దివ్యశ్రీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చా మన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి అనంతపురం నగరానికి చెందిన పలువురు అధికారులు, ప్రముఖ వైద్యులు, తదితరులు హాజరయ్యారు.

విద్యుత్ ఏఈగా సాయినాథ్ గౌడ్


ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి అర్బన్ విద్యుత్ శాఖ ఏఈ గా సాయినాథ్ గౌడ్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన గతంలో పుట్టపర్తి ఎస్పీ సర్కిల్ ఆఫీసులో కమర్షియల్ ఏఈ గా పని చేసేవాడు. పుట్టపర్తి అర్బన్‌ఏఈ గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు విద్యుత్ శాఖ వరంగా తలెత్తే సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించి సంస్థకు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన వినియోగదారులను కోరారు.

ఎట్టకేలకు లారీలు పంపిన అధికారులు

ప్రజాశక్తి - రొద్దం

స్థానిక కందుల సేకరణ కేంద్రానికి అధికారులు లారీలను పంపించారు. కందుల కొనుగోలు కేంద్రం వద్ద పడికాపులు శీర్షికన ప్రజాశక్తిలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అధికారులు, మార్క్ ఫెడ్ కంపెనీ వారు స్పంచించి బుధవారం మండల కేంద్రానికి 9లారీలు పంపించినట్లు ఏజెన్సీ నిర్వాహకులు తెలపారు. తహశీల్దార్ ఉదయ్ శంకర్ రాజ్ ఆర్. మరవపల్లిలో ఉన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ఆర్. మరవపల్లి కేంద్రానికి 6,లారీలు, తురకలపట్నం కేంద్రానికి2,రెడ్డిపల్లి కేంద్రానికి 2 లారీల చొప్పున పంపించినట్లు తెలిపారు.


కందులను లారీల్లోకి లోడ్ చేస్తున్న దృశ్యం

చుక్కలూరులో నేరేడు మొక్కలు నరికివేత

బాధిత రైతుకు ఏపీ రైతు సంఘం పరామర్శ

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

అనంతపురం జిల్లా తాడిపత్రి మండల పరిధిలోని చుక్కలూరు గ్రామంలో 43 నేరేడు మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున నరికి వేశారు. రూరల్ పోలీసులు, బాధితుడు తెలిపిన సమాచారం మేరకు... చుక్కలూరు గ్రామానికి చెందిన మెడికుర్తి శ్రీనివాసులు తనకున్న ఒకటిన్నర ఎకరంలో మామిడి, నేరేడు మొక్కలను సాగు చేసుకున్నాడు. రెండు సంవత్సరాల కాలం ఉన్న నేరేడు మొక్కలు వచ్చే ఏడాది దిగుబడికి రానున్నాయి. ఇంతలో గుర్తు తెలియని వ్యక్తులు 43 నేరేడు మొక్కలను నరికేశారు. దిగుబడి వచ్చే మొక్కలు నరికి వేయడంతో బాధిత రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


నరికివేసిన నేరేడు మొక్కలను చూపుతున్న బాధిత రైతు


నేరేడు మొక్క

మొక్కలు నరికిన దుండగులను శిక్షించాలి : రైతుసంఘం

చుక్కలూరు గ్రామంలో రైతు శ్రీనివాసులకు చెందిన 43 నేరేడు మొక్కలను నరికేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి, నాయకులు జయశేఖర్ రెడ్డి, రెడ్డి రమేష్, శ్రీనివాసులు బుధవారం ఉదయం బాధిత రైతు పొలాన్ని పరిశీలించారు. నరికివేసిన నేరేడు మొక్కలను పరిశీలించి బాధిత రైతుతో మాట్లాడారు. అనంతరం రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ ఇటీవల మొక్కలు నరికే సంస్కతి ఎక్కువైందన్నారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలను ఇలా నరికేయడం, తొలగించడం విష సంస్కృతి అన్నారు. బాధిత రైతు శ్రీనివాసులుకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనకు కారణమైన దుండగులను అరెస్టు చేసి శిక్షించాలన్నారు.


నరికివేసిన నేరేడు మొక్కలను చూస్తున్న రైతుసంఘం నాయకులు